క్లుప్తంగా

కొల్చారం తైబజార్ వేలం రూ.61వేలు

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలోని తైబజార్ వేలం శుక్రవారం గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించారు. 2025–26 మార్చి నెలాఖరు నిర్వహించిన తైబజార్ వేలంలో గ్రామానికి చెందిన బ్యాగరి నగేశ్ రూ.61వేలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి అంజయ్య, కారోబార్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వ్యాపార కేంద్రం రంగంపేట తైబజార్ వేలం శనివారం నిర్వహించినట్లు ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజు శుక్రవారం తెలిపారు.

క్షీరాభిషేకం

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ వద్ద ఎమ్మార్పీఎస్, కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు పాతూరి రాజు మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసిన అన్ని పార్టీల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ వర్గీకరణకు సుదీర్ఘ పోరాటం కొనసాగించిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు ఎల్లవేళలా రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పంజా మహేందర్, జిల్లా నాయకుడు సుధాకర్, మండలాధ్యక్షుడు కొమ్మాట అమర్, ఎమ్మార్పీఎస్ నాయకులు ఎల్లం, స్వామి, సామల మహేశ్, రాజు, స్వామి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని శౌకత్‌పల్లి గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణ పనులను మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రావిపల్లి అమరాసేనారెడ్డి ప్రారంభించారు. ఈ మేరకు శుక్రవారం శౌకత్‌పల్లి గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణ పనుల నిమిత్తం 500 మీటర్లను గాను రూ.20 లక్షల నిధులు విడుదల అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లాల్యా నాయక్, సుర రాములు, సూర్య నాయక్, రాజునాయక్, మంజుల, బోయిని నాగరాజు, బాలయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎండిన పంటలకు పరిహారం చెల్లించాలి

పాపన్నపేట(మెదక్): ఎండిన వరి పంటలకు వెంటనే పరిహారం చెల్లించాలని సీపీఎం మండల నాయకులు అశోక్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని బాచారం గ్రామంలో పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండుతున్న ఎండలతో, బోరు బావుల్లో నీరు అడుగంటి పోతుందన్నారు. దీంతో చేతి కొచ్చిన పంటలు ఎండిపోతున్నాయని చెప్పారు. ప్రభుత్వం స్పందించి ఎండిన పంటలకు ఎకరాకు రూ.40 వేల పరిహారం చెల్లించాలన్నారు.

దీక్షలో బీజేపీ నాయకులు



దీక్షలో పాల్గొన్న బీజేపీ నాయకులు

నర్సాపూర్: ప్యారానగర్‌లో నిర్మిస్తున్న డంప్ యార్డును ఎత్తి వేయాలన్న డిమాండ్‌తో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శుక్రవారం నాటికి 31వ రోజుకు చేరాయి. దీక్షలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్ మాట్లాడుతూ.. డంప్‌యార్డును ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో ఆయనతో పాటు పార్టీ నాయకులు నీలి నగేష్, సంజీవ రెడ్డి, దిగంబర్‌రావు, రాంలు, రాజేశ్, నగేశ్‌గౌడ్, రాగరాజు, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నీటిని వాడితే చర్యలు తీసుకోండి

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామంలోని హైదర్ చెరువు నుంచి నీటిని వాడితే చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రమ్యశ్రీకి వినతిపత్రం అందించారు. శుక్రవారం నార్లాపైర్ గ్రామంలోని పలువురు రైతులు హైదర్ చెరువు నుంచి జేసీబీల సహాయంతో కాల్వలు తీసుకొని కాళేశ్వరం కాల్వల ద్వారా నింపిన చెరువుల నుంచి అక్రమంగా నీటిని వాడుకుంటున్నారని తెలిపారు. ఇందుకు అధికారులు అక్రమంగా నీటిని వాడుకుంటూ వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అంబులెన్స్‌లో ప్రసవం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మల్లుపల్లి గ్రామానికి చెందిన మానస పురిటి నొప్పులతో బాధపడగా ఆస్పత్రికి తరలించేందుకు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. శుక్రవారం గర్భిణి మహిళను 108 సిబ్బంది మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా, పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ లింగులాల్, పైలెట్ ఆసిఫ్ అంబులెన్స్‌లోనే మహిళలకు ప్రసవం చేయగా, బిడ్డకు జన్మనిచ్చింది. తల్లిబిడ్డను మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రశాంతంగా ‘పది’ పరీక్షలు



నిజాంపేట(మెదక్): పరీక్ష కేంద్రం వద్ద హాల్ టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం పదో తరగతి మొదటి పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. పోలీసులు బందోబస్త్ నిర్వహించారు. మొదటి రోజు విద్యార్థుల వెంట పలువురు తల్లిదండ్రులు పరీక్ష కేంద్రానికి వచ్చి వారికి మనోధైర్యం కల్పించారు.



వెల్దుర్తి(తూప్రాన్): పరీక్షా హాల్‌లోకి వెళ్తున్న విద్యార్థులు



చిలప్‌చెడ్(నర్సాపూర్): పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు



నర్సాపూర్: పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



పాపన్నపేటలో పరీక్ష కేంద్రం వద్ద..



చేగుంట పరీక్ష కేంద్రంలో సూచనలు చేస్తున్న అధికారులు



పెద్దశంకరంపేటలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులను అందిస్తున్న తహసీల్దార్, నాయకులు

టేక్మాల్(మెదక్): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేశ్ తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలతో శుక్రవారం టేక్మాల్ రైతువేదికలో తహసీల్దార్ తులసీరాం ఆధ్వర్యంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం సీఎంఆర్ఎఫ్ కింద రూ.10.14లక్షల విలువ గల చెక్కులను 23మంది లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో జోగిపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, పీఏసీఎస్ డైరెక్టర్లు పాపయ్య, నర్సింహరెడ్డి, ఆర్ఐ సాయిశ్రీకాంత్, మాజీ వైస్ ఎంపీపీలు విష్ణువర్ధన్‌రెడ్డి, మల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులు మాన్‌కిషన్, కిషోర్, సాగర్, సంగమేశ్వగౌడ్, రాజేశ్‌గౌడ్, మజహర్, మహేశ్‌రెడ్డి, సంగయ్య, సక్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆడ బిడ్డలకు వరం

రేగోడ్(మెదక్): కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఆడ బిడ్డలకు వరమని తహసీల్దార్ దత్తారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం 18 కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పీసీసీ సభ్యుడు ఎం.కిషన్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఎస్.దిగంబర్‌రావు, ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్యాంరావు కులకర్ణి, ఏఎంసీ డైరెక్టర్ శ్రీధర్‌గుప్తా, ఆర్ఐ విజయలక్ష్మి, కో ఆప్షన్ మాజీ సభ్యుడు చోటుమియా తదితరులు పాల్గొన్నారు.

కొల్చారం నూతన ఎంపీడీఓగా రఫీకునిస్సా



కొల్చారం(నర్సాపూర్): మండల నూతన ఎంపీడీవోగా రఫీకునిస్సా శుక్రవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. కొంతకాలంగా ఎంపీడీఓ స్థానం ఖాళీగా ఉండడంతో ఎంపీఓ ఆ బాధ్యతలు నిర్వర్తిస్తూ వచ్చారు. పెద్దశంకరంపేట ఎంపీడీఓగా పనిచేసిన రఫీకునిస్సా ఇన్‌చార్జ్ ఎంపీడీగా ఇక్కడికి బదిలీపై వచ్చారు.

పండుగ ముందు చాటింపు వేయించాలి

నర్సాపూర్: పండుగల ముందు పట్టణంలో చాటింపు వేయించాలని బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు రాజు అధికారులను కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ..పలు సందర్భాల్లో పండుగలు నిర్వహించే తేదీలు ప్రకటించకపోవడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారని చెప్పారు. కాగా పట్టణంలోని శివాలయం, హనుమాన్ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేసే ఆయా రోజుల్లో శుభ్రం చేయించాలని మున్సిపల్ అధికారులను కోరారు. గతంలో పలుమార్లు మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని విచారం వ్యక్తం చేస్తూ.. ఆలయాల వద్ద మున్సిపల్ అధికారులు వివక్ష వదిలి ఆలయాల పరిసరాలు శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

మా గ్రామంలో మరో పరిశ్రమ వద్దు

చిన్నశంకరంపేట(మెదక్): మా గ్రామంలో మరో పరిశ్రమ ఏర్పాటుకు ఎలాంటి అనుమతులు ఇవ్వొద్దని మండలంలోని చందంపేట గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. శుక్రవారం చందంపేట గ్రామంలో గ్రామసభను నిర్వహించగా, డీఎల్‌పీఓ సురేశ్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి పద్మ మాట్లాడుతూ.. ఎంహెచ్ ప్యాక్‌టెక్(స్పాంజ్) పరిశ్రమ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీంతో అక్కడికి పెద్ద ఎత్తున చేరుకున్న గ్రామస్తులు ముక్తకంఠంతో తమ గ్రామంలో పరిశ్రమ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వొద్దని కోరారు. ఇప్పటికే ఉన్న రసాయన పరిశ్రమ కాలుష్యంతో ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. మరో పరిశ్రమ వస్తే తాము గ్రామంలో ఉండాల వద్దా అని ప్రశ్నించారు. గ్రామస్తులు రాతపూర్వకంగా డీఎల్‌పీఓ సురేశ్‌బాబుకు వినతి పత్రం అందించారు.



చందంపేటలో గ్రామసభలో పరిశ్రమ వద్దని చెబుతున్న గ్రామస్తులు

ప్రమాదాల నివారణకు చర్యలు



కాళ్లకల్ వద్ద జాతీయ రహదారిని పరిశీలిస్తున్న సీఐ రంగాకృష్ణ, ఎన్‌హెచ్ ప్రతినిధులు, ఎస్ఐ

మనోహరాబాద్(తూప్రాన్): జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ఎస్పీ ఆదేశాలతో తూప్రాన్, మనోహరాబాద్ పరిధిలో బ్లాక్‌స్పాట్‌లను పరిశీలించినట్లు సీఐ రంగాకృష్ణ తెలిపారు. శుక్రవారం ఎన్‌హెచ్ ప్రతినిధులు, ఎస్ఐ సుభాష్‌గౌడ్‌లతో కలిసి మనోహరాబాద్, దండుపల్లి, కాళ్లకల్, కూచారంల వద్ద యూటర్న్‌లను పరిశీలించి, మాట్లాడారు. వాటి వద్ద ప్రమాదాల నివారణకు తగిన చర్యలతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. కాగా ఇట్టి బ్లాక్‌స్పాట్‌లు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కూచారం వద్ద సర్వీస్ రోడ్డు వేయనున్నట్లు చెప్పారు.

విద్యా రంగానికి నిధులు పెంచాలి

నర్సాపూర్: రాష్ట్రంలో విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యా రంగానికి తక్కువ నిధులు కేటాయించడంపై తమ సంఘం నిరసనలు వ్యక్తం చేస్తుందని చెప్పారు. విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రియాంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

పరీక్ష కేంద్రాల్లో తిరగని ఫ్యాన్లు

అల్లాదుర్గం(మెదక్): పది పరీక్షలకు పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పలేదు. గదుల్లో ఫ్యాన్లు తిరగక పోగా, అస్తవ్యస్తంగా కరెంట్ స్విచ్ బోర్డులు ఉన్నాయి. ఇది గడిపెద్దాపూర్ పరీక్షా కేంద్రం దుస్థితి. ఈ పరీక్ష కేంద్రంలో ముస్లాపూర్, గడిపెద్దాపూర్ పాఠశాలలకు చెందిన 95 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. పరీక్ష కేంద్రం గదుల్లో రెండు ఫ్యాన్లు ఏర్పాటు చేస్తే ఒకటే ఫ్యాన్ తిరుగుతోంది. మరో ఫ్యాన్ తిరగడం లేదు. ఒక గదిలో ఫ్యాన్‌ను మొక్కుబడిగా ఏర్పాటు చేశారు. ఫ్యాన్‌కు కనెక్షన్ ఇవ్వకుండా ఏర్పాటు చేయడం విచిత్రం. దీంతో విద్యార్థులు ఉక్కపోతతో ఇబ్బందులకు గురయ్యారు. కరెంట్ స్విచ్ బోర్డులు సహితం అస్తవ్యస్తంగా మారాయి. ఏదైన ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.



గడిపెద్దాపూర్ పరీక్ష కేంద్రంలో కనెక్షన్ ఇవ్వకుండా ఏర్పాటు చేసిన ఫ్యాన్

ఈదురు గాలులతో కూడిన వర్షం

పాపన్నపేట(మెదక్): మండలంలో శుక్రవారం భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. సుమారు అరగంట పాటు వర్షం పడటంతో మామిడి కాయలు, చింతకాయలు నేల రాలాయి. చెట్టు కొమ్మలు విరిగి పడటంతో కరెంట్ అంతరాయం ఏర్పడింది. దీంతో మండల వాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



పెద్దశంకరంపేట(మెదక్): బస్టాండ్ వద్ద నిలిచిన వర్షపునీరు



పాపన్నపేటలో కురుస్తున్న వర్షం

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రెండు గంటల పాటు వర్షం కురవడంతో పలు కాలనీలతో పాటు రహదారులన్నీ చిత్తడిగా మారాయి. బస్టాండ్ వద్ద, పాత గ్రామ పంచాయతీ వద్ద రహదారులపై భారీగా వర్షం నీరు చేరింది. ఈ వర్షానికి వరిపంటలకు మేలు చేకూరగా, మామిడి, జొన్న పంటలకు ఇబ్బంది ఏర్పడింది.

చల్లబడ్డ వాతవరణం

కౌడిపల్లి(నర్సాపూర్): ఉరుములు మెరుపులతో శుక్రవారం సాయంత్రం మండలంలోని వివిధ గ్రామాల్లో చిరు జల్లులు కురవడంతో వాతావరణం చల్లబడింది. దీంతో ఎండ వేడిమి నుంచి ఉపశమనం లభించింది. భూగర్భ జలాలు అడుగంటడంతో పంటలకు నీరందక ఎండుముఖం పడుతున్నాయి. భారీ వర్షం పడితే బాగుండని రైతులు ఎదురు చూస్తున్నారు.

వడగళ్ల బీభత్సం

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం రాత్రి వడగళ్ల వాన కురిసింది. సాయంత్రం ఈదురు గాలులతో కురిసిన వర్షానికి పలు చోట్ల వృక్షాలు, విద్యుత్ స్తంభాలు ధ్వంసమయ్యాయి. మండలంలోని శెట్టిపల్లి కలాన్ గ్రామంలో నష్ట తీవ్రత ఎక్కువగా ఉంది. వర్ష బీభత్సానికి చంది చంద్రం, ఎర్ర శ్రీకాంత్, బయాన విజయ్‌కుమార్‌లకు చెందిన నివాస గృహాల ఇంటి పై కప్పు రేకులు ధ్వంసమై ఎగిరిపోయాయి. మాచారం విజయ ఇంటి ఆవరణలోని భారీ వృక్షం విరిగి ఇంటిపై పడడంతో ఇల్లు పాక్షికంగా దెబ్బతింది.

కనిపించని కార్యదర్శులు

- ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదని విధులకు ఎగనామం
- కార్యదర్శే ఇన్‌చార్జి ఎంపీఓ బాధ్యతలు, పర్యవేక్షణ కరువు



నడిమితండా కార్యదర్శి విధులకు రాక పోవడంతో మూతపడ్డ పంచాయతీ కార్యాలయం



కార్యదర్శి రాక మూతపడిన సీతానగర్ పంచాయతీ కార్యాలయం

అల్లాదుర్గం(మెదక్): గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వర్తించాల్సిన పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో కనిపించడం లేదు. గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగకపోవడంతో, ప్రభుత్వం ప్రత్యేక అధికారులతో పంచాయతీల పాలన సాగిస్తుంది. గ్రామ, మండల ప్రత్యేక అధికారులు ఎక్కడో ఉంటారో ఎవరికి తెలియదు. ప్రభుత్వం పంచాయతీలకు నిధులు ఇవ్వడం లేదని, తామే అప్పులు చేసి పంచాయతీల్లో పనులు చేపడుతున్నట్లు కార్యదర్శులు చెబుతున్నారు. ఇదే సాకు చూపుతూ కార్యదర్శులు గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహించక పోవడంతో పంచాయతీ కార్యాలయాలు మూతపడుతున్నాయి. మొక్కుబడిగా కొందరు గ్రామాలకు ఇలా వచ్చి అలా వెళ్తున్నారు. మరి కొందరు ఎప్పుడు వస్తారో, ఎక్కడ ఉంటారో తెలియని దుస్థితి.

అల్లాదుర్గం మండలంలో 16 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఒక్కో పంచాయతీకి కార్యదర్శిని ప్రభుత్వం నియమించింది.గ్రామ పంచాయతీల అభివృద్ధి కార్యదర్శులపైనే అధారపడి ఉంది. గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కార్యదర్శులు ప్రతీరోజు ఉదయం 8–30 గంటలకే గ్రామాల్లో ఉండి పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించాల్సి ఉంది. వీరు 12 గంటలు దాటినా కొందరు హాజరవుతుండగా, మరి కొందరు మాత్రం విధులు నిర్వహించడం లేదు. గ్రామ కార్యదర్శులు పంచాయతీ కార్యాలయాల్లో అడుగు పెట్టడం లేదని, ఎప్పుడు వస్తారో తెలియడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీతానగర్ కార్యదర్శి బుధవారం, గురువారం గ్రామంలో అడుగుపెట్టలేదని గ్రామస్తులు చెప్పారు. శుక్రవారం 11–30 గంటలు దాటిన నడిమితండా, గొల్లకుంట తండాలో కార్యదర్శులు రాలేదు. పంచాయతీ కార్యాలయానికి తాళం వేసి ఉంది. నడిమితండాలో ఆధార్‌కార్డు అప్‌గ్రేడ్ చేసేందుకు కార్యదర్శి సంతకం అవసరం ఉండగా, ఓ మహిళ కార్యాలయం ఎదుట పడిగాపులు కాయాల్సి వచ్చింది.

కార్యదర్శే ఎంపీఓగా అదనపు బాధ్యతలు

కార్యదర్శుల విధులపై ఎంపీడీఓ, ఎంపీఓలు పర్యవేక్షించాల్సి ఉంది. అల్లాదుర్గం మండల పంచాయతీ అధికారి బదిలీపై వెళ్లి ఏడాది దాటినా.. మరొకరిని నియమించలేదు. చిల్వెర గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఎంపీఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో తోటి కార్యదర్శులు విధులకు ఎగనామం పెట్టినా వారు పట్టించుకోవడం లేదని విమర్శలున్నాయి. ఇన్‌చార్జి ఎంపీఓ సక్రమంగా విధులు నిర్వహించకపోగా, విధులకు ఎగనామం పెట్టే వారికి సహకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. జిల్లా అధికారులు విచారణ జరిపి కార్యదర్శులు పంచాయతీల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఎంపీడీఓ వివరణ

ఈ విషయంపై ఎంపీడీఓ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా.. పంచాయతీ కార్యదర్శులు రోజు ఉదయం పంచాయతీల్లో విధులు నిర్వహించాలన్నారు. విధులకు ఎగనామం పెట్టి కార్యదర్శులపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రేడ్–4 కార్యదర్శికి ఎంపీఓగా అదనపు బాధ్యతలు అప్పటించిన విషయం వాస్తవమేనాన్నరు. విధులపై నిర్లక్ష్యం వహించే కార్యదర్శులపై చర్యలు తప్పవన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ముదిరాజ్ నాయకుల ముందస్తు అరెస్ట్

కౌడిపల్లి(నర్సాపూర్): ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ– ఏలో చేర్చాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం హైదరాబాద్‌లో ధర్నా నిర్వహించగా పోలీసులు ముదిరాజ్ సంఘం నాయకులను ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు కృష్ణ, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ ముందస్తు అరెస్ట్ చేశారు. అనంతరం సొంత పూచికత్తుపై విడుదల చేశారు.

◆ చలి వేంద్రం ఏర్పాటు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల్లో భక్తుల సౌకర్యార్థం ఓడిబియ్యం కాంట్రాక్టర్లు చలి వేంద్రం ఏర్పాటు చేశారు. ఆలయ సమీపంలో తాగునీటి ఇబ్బంది ఉంది. ఈ మేరకు స్పందించిన కాంట్రాక్టర్లు ఆలయ సమీపంలోని, చలువ పందిళ్ల కింద చలి వేంద్రం ఏర్పాటు చేశారు.

◆ పార్టీ జెండా మోసిన వారికే పదవి ఇవ్వాలి

పాపన్నపేట(మెదక్): కాంగ్రెస్ పార్టీ జెండాలు మోసిన వారికే ఏడుపాయల చైర్మన్ పదవి ఇవ్వాలని మండల కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు, హన్మంత్‌రావులకు విజ్ఞప్తి చేశారు.

◆ పేట తైబజార్ రూ.10 లక్షలు 50 వేలు

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట గ్రామ పంచాయతీ తైబజార్ వేలం పాటలో రూ.10 లక్షల 50 వేలకు పాడారు. శుక్రవారం చిన్నశంకరంపేట గ్రామ పంచాయతీ కార్యలయంలో గ్రామ కార్యదర్శి ప్రదీప్, ప్రత్యేక అధికారి దామోదర్ ఆధ్వర్యంలో తైబజార్ వేలం పాట నిర్వహించగా డీఎల్‌పీఓ సురేష్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా తైబజార్ వేలం పాటలో 10 మంది వరకు పాల్గొనగా అత్యధికంగా రూ.10.50 లక్షలకు దత్తు బజార్ దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

◆ అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్ పట్టివేత

చిన్నశంకరంపేట(మెదక్): అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్‌ను చిన్నశంకరంపేట పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం మండలంలోని ఖాజాపూర్ తండాలో డంప్ చేసిన ఇసుకను టిప్పర్‌లో లోడ్ చేసి తీసుకొని వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నమ్మదగిన సమాచారంతో పోలీసులు తండాకు చేరుకుని టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, టిప్పర్‌ను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

◆ విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

తూప్రాన్: పట్టణంలోని ప్రాథమిక పాఠశాలలో రాష్ట్రీయ గ్రామీణ సాక్షరత మిషన్ భారత్ సర్కార్ సహకారంతో శుక్రవారం ఒకటవ తరగతి విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం లక్ష్మణ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

◆ సైబర్‌క్రైంపై అప్రమత్తంగా ఉండాలి

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థులు, యువత సైబర్ క్రైంపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు. సంగారెడ్డి జిల్లా కంది వద్దగల వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు మండలంలోని తునికిలో ఎన్ఎస్ఎస్ శిబిరం నిర్వహిస్తున్నారు. ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా శుక్రవారం డాక్టర్ డి. రామానాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థులకు ఎస్ఐ రంజిత్‌రెడ్డి సైబర్‌క్రైంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బెట్టింగ్ యాప్‌లు, ఆన్‌లైన్ గేమ్స్ ఆడొద్దని, ఆన్‌లైన్ లోన్‌యాప్‌ల్లో లోన్ తీసుకోవద్దని తెలిపారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సేవచేయడం అభినందనీయమని చెప్పారు.ఈకార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు హరి, రమేశ్, నిలంభిక, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ వైభవంగా ధనలక్ష్మి జాతర



శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలో ధనలక్ష్మి అమ్మవారి జాతర కనుల పండువగా నిర్వహించారు. అందులో భాగంగా రెండవ రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు బండ్లు, బోనాల ఊరేగింపు, పోతరాజు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఆలయ నిర్వాహకుడు పెద్ద నర్సయ్య , వివిధ పార్టీల నాయకులు మహేశ్‌గుప్తా, కల్లూరి హరికృష్ణ, నవీన్‌గుప్తా, హన్మంత్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.